రాయచోటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించండి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మంత్రి మండిపల్లి వినతి

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలోనే రాయచోటి నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతమని ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌కి శుక్రవారం రాజంపేట ఆర్అండ్‌బి బంగ్లాలో వినతిపత్రం సమర్పించారు. గతంలో రాయచోటి నియోజకవర్గ ప్రజలకు తాగడానికి నీళ్లు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు 20 బోర్ల వరకు వేసి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయినేజీ, సమస్య అధికంగా ఉందని ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా చర్యలు తీసుకుంటానని మంత్రికి హామీ ఇచ్చారు.

పంచాయతీల బలోపేతానికి కృషి

భూ కబ్జాలకు పాల్పడితే గూండా చట్టం

రాయలసీమ కోసం కూలీగా పనిచేస్తా

ఆడబిడ్డల సంరక్షణ రాష్ట్రంగా తీర్చిదిద్దుతా

మైసూరివారిపల్లి గ్రామసభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

మైసూరివారిపల్లి గ్రామసభలో ప్రసంగిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-కడపప్రతినిధి/రైల్వేకోడూరు/రాజంపేట అర్బన్

రాష్ట్రంలోని పంచాయతీలను బలోపేతం చేస్తామని, స్వర్ణ పంచాయతీలు, డిజిటల్ భారత్ వైపు అడుగులు వేయిస్తామని ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. శుక్రవారం రైల్వే కోడూరు, రాజంపేట నియోజకవర్గాల పరిధిలోని మైసూరివారిపల్లి గ్రావసభ, అన్నమయ్య డ్యామ్ ముంపు గ్రామమైన పులపుత్తూరుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచా యతీల అభ్యున్నతి కోసం నిలబడేవాళ్లు దేశాన్ని కదిలించే నాయకులు అవుతారని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలను అభివృద్ధి చేయా లని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్య మైపోయిన సమయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సగర్వంగా గ్రామసభలను నిర్వహి ంచుకుం టున్నామని తెలిపారు. గతంలో గ్రామ పంచాయ తీలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వంలో నిధులు ఇచ్చి బలోపేతం చేస్తున్నా మని పేర్కొన్నారు. గ్రామాలలో దేశభక్తిని పెంపొం దించడానికి స్వాతంత్ర్య దినోత్సవాన్ని గొప్పగా జరపడానికి రూ.100, రూ.200 ఉన్న నిధులను రూ.10 వేలు, రూ.25 వేలకు పెంచా మని తెలిపారు. నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే రైల్వేకోడూరు ప్రాంతమే కాకుండా రాయల సీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఒక మహిళ ద్వారా తెలుసుకున్నానని, ఆమెను అభినందించారు. గ్రామాల జనాభాలో సుమారు 50 శాతం పైగా మహిళలు ఉంటారని, అన్ని గ్రామ సచివాల యాలలో మహిళలందరూ వెళ్లి తమ సమస్యలను తెలుపుకునేలా వాటిని రూపొందిస్తామని తెలిపారు. యువత నుంచి తాను కోరుకునేది ఒకటేనని అదే సామాజిక బాధ్యతని యువతకు సందేశం ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు బలోపేతం అవుతాయని తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామాలను నిర్వీర్యం చేశారని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైల్వేకోడూరును ఆంధ్రప్రదేశ్ ఉద్యానవన రాజధానిగా పిలుస్తారని, ఈ ప్రాంతంలో ఉద్యానవన పంటలు అధికంగా పండుతాయని తెలిపారు. ఎపిఎండిసిలో రైల్వేకోడూరు స్థానిక యువతకు ఎక్కువ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకో వాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. మైసూ రువారిపల్లి గ్రామసభను స్ఫూర్తిగా తీసుకొని రైల్వేకో డూరులోని అన్ని గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో నాలుగు ఇతివృత్తాలను తీసుకొని రాబోయే నాలుగేళ్లలో సుస్థిర పంచాయతీలుగా మార్చాలని మంచి ఉద్దేశంతో గ్రామసభలను నిర్వహించుకుంటున్నామన్నారు. గ్రామసభల ద్వారా

పులపత్తూరులో ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న పవన్

పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఉప ముఖ్య మంత్రి ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాను ముందుకు తీసుకెళ్లడానికి అన్ని విధాల కృషి చేస్తామని తెలిపారు. మైసూరువారిపల్లి సర్పంచ్ సంయుక్త మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమ గ్రామానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులు తమ గ్రామ పంచాయతీకి అందాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు రావడం సంతోష దాయకమని పేర్కొన్నారు. మైసూరు వారిపల్లిలో చేపట్టిన సిసి రోడ్లు, కోల్డ్ స్టోరేజ్, ఎన్‌ఆర్ఇజిఎ, రక్షణ గోడ నిర్మాణం, ఉద్యానవన పంటలకు బీమా తదితర పనుల గురించి ఆమె వివరించారు. కలెక్టర్ తమ గ్రామానికి రూ.10 లక్షల నిధులను ప్రత్యేకంగా కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలి పారు. అనంతరం తమ గ్రామానికి సంబంధించిన వివిధ సమస్యలైన రోడ్లు, యువతకు ఉపాధి, పాఠశాలలో ఆటస్థలం కేటాయింపు, తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రికి విన్నవించారు. అనంతరం మైసూరువారిపల్లి పంచాయతీ కార్యదర్శి మహేష్ గ్రామానికి సంబంధించిన వివిధ పనులను తెలుపుతూ గ్రామసభ యొక్క అంగీకారాన్ని కోరగా పనులన్నింటికీ గ్రామసభ అంగీకారం తెలిపింది. సమావేశంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ముక్కా సాయి వికాస్‌రెడ్డి, జనసేన నాయకులు, డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్, తాతంశెట్టి నాగేంద్ర, యనమల భాస్కరరావు, పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేష్, నాగరాజ, జోగినేని మణి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు జెసి ఆదర్శ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, డ్వామా పీడీ మద్దిలేటి పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

అన్నమయ్య ప్రాజెక్టు బాధితులు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని పవన్ కల్యాణ్ అన్నారు. పులపుత్తూరు గ్రామంలో పర్యటించి అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితుల కన్నీటి గాధను ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన ఫొటో గ్యాలరీని అధికారులు ఏర్పాటు చేయడంతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్నమయ్య ప్రాజెక్ట్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన బాధితులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఆ దిశగా ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. 300 ఇళ్ల నిర్మాణానికి రూ.6 కోట్ల బిల్లులు సత్వరమే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఐదు సెంట్లు భూమి కోల్పోయి కేవలం 1.5 సెంట్లు పరిహారం పొందిన వారికి 5 సెంట్లు ఇస్తామన్నారు. భవిష్యత్తులో వరద నష్టం జరగకుండా ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకు ంటామన్నారు. రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంటరీ అధ్యక్షులు ఎల్లటూరు శ్రీనివాసరాజు, నియోజకవర్గ సమన్వయకర్త ఆతికారి దినేష్, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ పాల్గొన్నారు.

స్థలదాత నారాయణను అభినందిస్తున్న పవన్

తవ్వేకొద్దీ వెలుగుచూస్తున్న అక్రమ మైనింగ్ : సిపిఎం

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

మైనింగ్ మాఫియా లీలలు తవ్వే కొద్దీ బయట పడుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్లు, చిన్న చిన్న ఇంటి నిర్మాణాలు చేసుకునే ఇంటి యజమానులకు ఇసుక దొరక్క ఇబ్బందులు పడుతుంటే మాఫియాలో భాగస్వామ్యంగా ఉన్న వారు ఇసుకను కుప్పలు, కుప్పలుగా పోగేసుకుని లాభాలు గడిస్తున్నారని పేర్కొన్నారు. బహుదా కాలువను సైతం ఆక్రమించి ఇసుకను కొల్లగొట్టుతున్న ఘనులు మదనపల్లిలోనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 10 ఇసుక అక్రమ నిల్వ కేంద్రాలు, 2 మట్టి అక్రమ నిల్వ కేంద్రాలు చూపించామని, ఒక్క చోట మాత్రమే ఇంటి నిర్మాణానికి తోలుకున్నామంటూ వచ్చారని, అదికూడా అనేక అనుమానాలు ఉన్నాయని, ఒక్క చోట మాత్రమే ఇసుకను సీజ్ చేశారని, మిగిలిన చోట్లకు అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక మతలబు ఏంటో చెప్పాలని పేర్కొన్నారు. మైనింగ్ మాఫియాతో అంటకాగుతున్న నేతలు సిపిఎంపై బురదజల్లడం మానుకుని, ప్రజలకు అండగా ఉండి బురద పడకుండా చూసుకోవాలని సూచించారు. మైనింగ్ మాఫియాపై సమగ్ర విచారణ జరిపించాలని, సంబంధం ఉన్న అందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం చూపిన ఇసుక, మట్టిని ప్రభుత్వ గృహ నిర్మాణాలు చేసుకునే పేదలకు సరఫరా చెయ్యాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం నాయకులు పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలోని అన్నివర్గాల ప్రజకు ఉపయోగపడే ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడం సామాన్య ప్రజలకు తీవ్ర కష్టంగా ఉందని పేర్కొన్నారు. సిపిఎం ఇసుక మాఫియాపై చేస్తున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇసుక అక్రమ నిల్వలు కనిపెట్టి అక్కడి నుండి ఫోన్ చేసినా స్పందించని తహశీల్దారు మాఫియా కనుసన్నల్లో ఉండటం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు హరిశర్మ మాట్లాడుతూ ఇసుక దొరక్క ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కార్మికులకు ఉపాధి లేకుండా పోతోందన్నారు. ఉచిత ఇసుక సైట్ ఓపెన్ కాకపోయినా బడా బాబులకు, ఇసుక వ్యాపారులకు లక్షలు కురిపిస్తోందని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నిర్దిష్ట ఆధారాలతో ఆరోపణలు చేస్తే వాటికి సమాధానం చెప్పడంలో విఫలమై వ్యక్తిగత దూషణ చేయడం రాక్షస చర్య అన్నారు. మైనింగ్ మాఫియా అరికట్టక పోతే అప్రతిష్ట పాలైయ్యేది అధికార పార్టీనే అని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

పుల్లంపేట : ఇస్రో ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి చిరంజిబ్ గుహ మజుందార్, శాస్త్రవేత్త ఎస్ఇ ఇస్రో, అంతరిక్ష విభాగం పాల్గొని మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ఇస్రో చంద్రయాన్-3 అంతరిక్ష యాత్ర చేపట్టి ఆగస్టు 23వ తేదీ ల్యాండర్‌ను చంద్రుడిపై దింపిందన్నారు. విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలవైపు మొగ్గు చూపేలా మనం అందరం ప్రోత్సహించాలని, యువకుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచేందుకుగాను వివిధ కార్యక్రమాలు చేపట్టాలని అధ్యాపకులకు తెలియజేసారు. టచింగ్ లైవ్స్ వైల్ టచింగ్ మూన్-ఇండియాస్ స్పేస్ సాగర్ థీమ్‌తో ఈ ఏడాది నేషనల్ స్పేస్ డే వేడుకలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ రామనాథం, విద్యావేత్తలు, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ చంద్ర శేఖర్, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. **రాయచోటి :** అంతరిక్ష పరిశోధనలతో జీవన ప్రయోజనాలు మెరుగవుతున్నవని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్, ఆదిత్య వంటి అంతరిక్ష విజయాల ద్వారా ఇస్రో మానవ ప్రయోజనాలను మెరుగుపరుస్తున్నదన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, నమూనాల తయారీ, డ్రాయింగ్, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలలో విద్యార్థులు విజయవంతంగా నిర్వహించిన చంద్రయాన్ లాంచింగ్ ప్రయోగం విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రెడ్డయ్యరెడ్డి, శంకరయ్య, విజయ సారధిరెడ్డి, రవిశంకర్, రామయ్య, రెడ్డి శేఖర్, నబి సాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, పోటీతత్వం కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎన్.రాజయ్య, ఇంద్రావతి, సురేంద్ర, ప్రసాద్ రెడ్డి, కిషోర్, చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, వెంకటరత్నం, పీడీ బాల శేఖర్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మదనపల్లె బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగపు హెడ్ రామ్మోహన్ అధ్యక్షతన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కాంచీపురంకు చెందిన ఐఐఐ టిడిఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్ కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అంతరిక్ష పరిశోధనల విశిష్టతను తెలిపారు. అంతరిక్ష ప్రయోగంలో ఉపయోగించే పద్ధతుల గురించి విద్యార్థులకు విపులంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ జి.శ్రీదేవి, డాక్టర్ శైలజ, డాక్టర్ రాఘవరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ చిన్నారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయచోటి : రాకెట్ ప్రయోగం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్ఆర్ఐటిలో ఉచిత సైబర్ సెక్యూరిటీపై శిక్షణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థి సాధికారతలో భాగంగా హనీ వెల్ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఉచిత సైబర్ సెక్యూరిటీ శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ స్టేట్ హెడ్ ఐటిసి అకాడమీ దినకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దినకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి డిజిటల్ ప్రపంచంలో సుస్థిరత భద్రత డెవలప్‌మెంట్ కోసం వ్యూహంలో సైబర్ సెక్యూరిటీ ఒక ముఖ్యమైన భాగంగా మారిందన్నారు. ఈ శిక్షణ పొందడం వల్ల స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు అన్నారు. డాక్టర్ వై సుబ్బారెడ్డి మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలను కలిగి ఉండటం వల్ల ప్రపంచ స్థాయి కంపెనీలలో ఉద్యోగాలు మెండుగలపై లభిస్తాయి అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, అకాడమీ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డి ప్రశాంత్, సైబర్ ఇన్‌స్పెక్టర్ ఉమర్ అబ్దుల్ ఖాన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి , హెచ్‌ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి భరోసానివ్వండి

మంత్రి లోకేష్‌ను కలిసిన సురేంద్ర

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్: తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన, అక్రమ కేసులతో ఇబ్బందులు పడుతున్న వారికి భరోసా కల్పించాలని ఐటి, మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్‌కి టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ మంత్రి లోకేష్ సమస్యల పట్ల మంచి అవగాహన ఉందన్నారు. ఆయనతో సమావేశం ఎంతో సజావుగా సాగిందన్నారు. ముఖ్యంగా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి అక్రమ కేసులకు ఇబ్బంది పడుతున్న నాయకులు, కార్యకర్తలకు ఆ కేసుల నుంచి విముక్తి కల్పించాలని, నామినేటెడ్ పదవులు అధిక ప్రాధాన్యత నివ్వాలని కోరామన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని కోరామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలను ఆయనకు క్లుప్తంగా వివరించానన్నారు. తాను చెప్పిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు సురేంద్ర తెలిపారు. తంబళ్లపల్లి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

'ఆదిత్య'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లి : ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. అన్ని దానాలలో కెల్లా రక్తదానం చాలా గొప్పదని చెప్పారు. అందరూ రక్తదానం చేయడం వలన ఎంతోమంది ప్రజల ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు మాట్లాడుతూ ఎవరైనా ప్రమాదాల బారిన పడినప్పుడు రక్తం చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రక్తదానం యొక్క ఆవశ్యకతను వివరించారు. 92 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.అరుణ్ కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన విద్యార్థులు, అధ్యాపకులు

ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్ఒ సత్యనారాయణరావు

అందరికీ ఆదర్శం 'ఆంధ్ర కేసరి' : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తిదాయకం, ఆదర్శ ప్రాయుడని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, తమ పిల్లలకు కూడా కష్టపడి క్షుణ్ణంగా తెలుసుకొని ముందుకు వెళ్లే విధంగా నేర్పించాలని డిఆర్ఒ సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి సంస్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో తన చొక్కా చించి ధైర్యంగా రొమ్ము చూపించి ధైర్యముంటే కాల్చుమని బ్రిటిష్ పోలీసులకు సవాలు చేసిన ధీశాలి అని పేర్కొన్నారు. ప్రజాసేవలో తన జీవితాన్ని దార పోసిన మహనీయుడన్నారు. ఆయన అడుగుజాడలే ఆదర్శంగా ప్రతి ఒక్కరూ దేశభక్తి, క్రమశిక్షణతో మెలిగి మంచి పౌరులుగా రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రకాశం పంతులు భారతదేశానికి చెందిన న్యాయవాది, వలసవాద వ్యతిరేక జాతీయవాది, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్తని పేర్కొన్నారు. నైతిక విలువలను ప్రాణంగా భావించే ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో ఉన్న మద్రాస్ ప్రెసిడెంట్‌కి ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారని, ఆంధ్ర రాష్ట్రం మద్రాస్ నుంచి విడిపోయాక ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఉన్నారని చెప్పారు. టంగుటూరికు ఆంధ్ర కేసరి (ఆంధ్ర సింహం) అనే బిరుదు కూడా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ టంగుటూరి ప్రకాశం పంతులను ఆదర్శంగా స్ఫూర్తి దాయంగా తీసుకొని ముందుకెళ్లాలని చెప్పారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, రెవెన్యూ, బిసి సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పవన్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు: మైసూరువారిపల్లి పంచాయతీలో జరిగిన గ్రామసభలో కోడూరు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి పి.జాన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, బొజ్జ శివయ్య జిల్లా కమిటీ సభ్యులు, మద్దెల ప్రసాద్, నందకుమార్ పాల్గొని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పవన్ కల్యాణ్ వినతిపత్రం చదివి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కలకత్తా ఆర్‌జికర్ జూనియర్ డాక్టర్‌పై చోటు చేసుకున్న అత్యారం, హత్యను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నిరసనలు పిలుపులో భాగంగా జమ్మలమడుగులో శుక్రవారం స్థానిక ఎస్‌పి జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భగా ఎస్ఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ నాయకులు హుస్సేన్ మియా మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ ప్తె అత్యాచారానికి సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశ్యారు. మహిళపై అత్యాచారాలు చట్టాలు కఠిన తరం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు హరిబాబు, విష్ణు, చంద్రశేఖర్ ఫ్యామిలీ షరీఫ్ రఫీ ఇమామ్ నూరు పాల్గొన్నారు. **అట్లూరు :** జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య చాలా నీచమైన ధర్మార్గమైన చర్యని వడ్డెర వృత్తి దారుల సంఘం మండల నాయకులు బత్తల గంగయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో వడ్డెర వృత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు.

విద్యార్థులకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌లో ఆర్అండ్‌డి విభాగం మేధో సంపత్తి హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు మంత్రిత్వ శాఖ, అసిస్టెంట్ డైరెక్టర్- ఐపిఆర్ సతీష్ కుమార్, ఐపి సలహాదారు, న్యాయవాది, జయా, ఐపి వ్యవస్థాపకులు స్వర్ణ శ్రీవాస్తవ పాల్గొని మాట్లాడుతూ మేధో సంపత్తి అనేది మనిషి తెలివితేటలకు సంబంధించిన ఆస్తిగా భావిస్తారని, వీటిపై లభించే హక్కులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. మేధస్సు లేదా తెలివితేటల ద్వారా మనుషులు సృష్టించిన వస్తువులు, ఇతర కష్టార్జితంపై అన్ని హక్కులు, దాని సృష్టికర్తకే ఉంటాయన్నారు. దీన్ని వ్యక్తుల మేధస్సుకు లభించే కనిపించని ఆస్తిగా భావిస్తారని చెప్పారు. మన దేశంలో చాలా రకాల మేధో సంపత్తి హక్కులు అమల్లో ఉన్నాయన్నారు. కాపీరైట్, పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, ట్రేడ్ సీక్రెట్లు వంటివన్నీ ఈ విభాగంలో ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలోని చాలా దేశాల చట్టాల్లో మేధో సంపత్తి హక్కులను చేర్చారన్నారు. న్యాయ వ్యవస్థల్లో దీనికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని తెలిపారు. మేధో వస్తువుల సృష్టిని ప్రోత్సహించడమే మేధో సంపత్తి చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. వ్యక్తులు కనిపెట్టిన లేదా సృష్టించిన వస్తువులకు లభించే గుర్తింపు, వాటి ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనాలపై పూర్తి హక్కులు సృష్టికర్తలకే చెందాలని ఈ చట్టాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. సృజనాత్మకత, ఆవిష్కరణలు వృద్ధి చెందే వాతావరణాన్ని పెంపొందించడం దీని ముఖ్య లక్ష్యమని,

సదస్సులో మాట్లాడుతున్న సతీష్ కుమార్

అధ్యాపకులు వీటి పై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు తమ తెలివితేటలతో సృష్టించే ఆవిష్కరణ, డిజైన్లు, చిహ్నాలు, పేర్లు, చిత్రాలు వంటివి ఐపిఆర్ జాబితాలో ఉంటాయని, వీటికి వ్యక్తుల మనసు, తెలివితేటలు ప్రాణం పోస్తాయని పేర్కొన్నారు. వీటి సృష్టికి సంబంధించిన ఐడియాలు కంటికి కనిపించవని తెలిపారు. ఈ ఐడియాలనే మేధో సంపత్తి అంటారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ తమ కలశాల అధ్యాపకులకు ఇలాంటి విలువైన సంచారని అందించిన అతిథులకు కృతజ్ఞతలు తెలియజేసారు. కార్యక్రమంలో అడ్వైసర్ ఆర్అండ్‌డి డాక్టర్ తులసీరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ డాక్టర్ శివయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి కేక్ అందిస్తున్న ప్రిన్సిపల్ మలాంషావలి

దాతృత్వం చాటుకున్న సర్పంచ్

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాత రాతి గుంటపల్లి సర్పంచ్ కోనేని అలివేలు శుక్రవారం నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం భోజనంతో పాటుగా పెరు గును పంపిణీ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ మలాంషావలి తెలిపారు. ఇలాంటి దాతలు ముందుకు వచ్చి పేద పిల్లలకు తమ వంతు కృషిగా దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు, వైస్ చైర్మన్ రిజ్వానాఅక్బర్ పిల్లలకు అరటి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఎల్లవే ళలా తమ సహకారం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు వైస్ చైర్మన్ రిజ్వానాఅక్బర్, ప్రిన్సిపల్ మలాంషావలి, ఎంఇఒ మునీంద్రనాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు గోకులాలు మంజూరు : ఎడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



మాట్లాడుతున్న గుణశేఖర్

పాడి రైతులకు ప్రభుత్వం గోకులాల షెడ్లు మంజూరు చేసిందని జిల్లా పశుసంవర్ధకశాఖ ఎడి గుణశేఖర్ పిళ్లై తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలో జరిగిన గ్రామ సభలలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కరువు మండలాలలో ఒక్కో మండలానికి 50 యూనిట్లు, కరువు మండలంగా ప్రకటించబడని మండలాలకు 25 యూనిట్లు చొప్పున మంజూరైనట్లు తెలిపారు. యూనిట్లు విలువలో 90 శాతం ఎన్ఆర్ఇజిఎస్ నిధులు ఇస్తారన్నారు. మరో పది శాతం రైతు భాగస్వామిగా చెల్లించాలని చెప్పారు. రెండు ఆవులకు రూ.1.15 లక్షలు, నాలుగు ఆవులు ఉంటే రూ.1.80లక్షలు, ఆరు 6 ఆవులు ఉంటే రూ.2.30 లక్షలు మంజూరు చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి నియం త్రణకు టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 18న వరకు టీకా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు 3.45 లక్షల టీకాలు వచ్చినట్లు యని, ఇప్పటి వరకు 27 వేల పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు.

ఘనంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని చీకలబైలు పంచాయతీ, రాగిమాకులపల్లిలో శ్రీమారెమ్మ దేవతా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖ అర్చకులు సతీష్ శర్మ, మంజునాథ్ శర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ విమాన గోపు రం ప్రతిష్ట, కలా హోమం, గోనిరీక్షణ, నేత్రన్మీలన ప్రాణ ప్రతిష్ట, కలాసం యోజన ప్రతిష్టాంగ హోమం, దుర్గ (చండీ)హోమం, పూర్ణా హుతి, కుంభా భిషేకం, దేవి అలంకారం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదం వినియోగం తదితర కార్యక్ర మాలు చేపట్టారు. క్రోధి నామ సంవత్సరం, శ్రావణ బహుళ విజయ రోజున విగ్రహ ప్రతిష్ట చేయడం శుభ సూచకమని అర్చకులు తెలిపారు. అనంతరం ప్రజలు, భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్యాండు మేళం, డిజే సౌండ్స్, చెక్క భజనలు నడుమ అమ్మ ఊరేగింపు కన్నుల పండుగలా జరిగింది. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిపిఐ సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి సిపిఐ సీనియర్ నాయకుడు హైదర్‌ఖాన్ శుక్రవారం అనారోగ్యంతో మరణిం చారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తన గృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహానికి సిపిఎం కార్యదర్శి శ్రీనివాసులు నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదర్ ఖాన్ మదనపల్లి కార్మిక ఉద్యమానికి ఎంతో తోడ్పడ్డారని, కార్మిక సమస్యల పరిష్కా రానికి ఎంతో ఓపికగా పనిచేసే వారని అన్నారు. కార్మికులు ఐక్య కార్యాచరణ పోరాటాలు జరిపినప్పడే పెట్టుబడిదారులు అధికారులు ప్రభుత్వాలూ దిగివస్తాయని చెప్పేవారని అన్నారు. నివాళి అర్పించిన వారిలో సిఐటియుసి నాయకులు కృష్ణమూర్తి, సిఐటియు నాయకులు హరిశర్మ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దోబీ కాలనీలో మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎంపిడిఒకు వినతి పత్రం అందిస్తున్న కాలనీవాసులు

మదనపల్లి రూరల్ మండలం, సిటియం క్రాస్ రోడ్డు గ్రామ పంచాయతీలో గల దోబీ కాలనీలో ప్రజలు నివాసం ఉండటానికి అవసరమైన ప్రాథమిక మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎంపిడిఒకు వినతిపత్రం అందించారు. నలవీర గంగా భవాని రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి నిధులు ఎం.శివ శంకర్, కె.శివకృష్ణలు ఎంపిడిఒ భాను ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన రెండు దశాబ్దాలుగా దోబి కాలనీలో సౌకర్యాల లేమితో ప్రజలు నివాసము ఉండడం జరుగుతోందని తెలిపారు. ఈ దోబీ కాలనీలో 58 మందికి ఇంటి నివాస స్థలాలు కేటా యించడం జరిగిందని, కేవలం కులవృత్తిని ఆధారంగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే దోబీ కాలనీలో కనీసం రోడ్లు, మురుగు నీటి కాలువలు, తాగు నీరు, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు, 38 మంది పునాదులు వేసుకొని ఇంటి నిర్మాణం కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. అధికారులు తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : 'నల్లారి'

పీలేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ప్రజల భాగస్వామ్యంతో వారి అవసరాలను గుర్తించి పనులు చేపట్టాలన్న ప్రభుత్వ లక్ష్యం కోసం నిర్వహిస్తున్న గ్రామసభలకు సమస్యలున్నవారే హాజరయ్యేలా చూడాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పీలేరు మండల పరిధిలో శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో జరిగిన మొదటి స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామ సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన కొత్త పనులను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల భాగస్వామ్యంతో ఎంపిక చేసి వాటిని చేపట్టాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. పట్టణంలోని పాలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తాగునీటి సమస్యలు, మురుగునీటి కాలువల నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలు మొదలకు సమస్యలపై సభాముఖంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.సమావేశంలో మండల ప్రత్యేక అధికారిణి ప్రసన్నకుమారి, ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డి, తహశీల్దారు భీమేశ్వరరావు, సిఐ యుగంధర్, గ్రామపంచాయతీ ఇఒ గురుమోహన్, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి సర్పంచ్ షేక్ జీనత్ షఫీ, జిల్లా పరిషత్ కుమార్ సభ్యులు ఎస్ఎండి షఫీ, టిడిపి నాయకులు కోటపల్లి బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నారే సతీష్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, భూమిరెడ్డి శరణ్‌కుమార్ రెడ్డి, అతికా షఫీ, జనసేన నాయకులు సుధాకర్ పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** ప్రజా సమస్యలను పరిష్కరించుకునేందుకే గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపిడిఒ మనోహరరాజు తెలిపారు.మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఆయా పంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఇంటింటికి తాగునీటి కుళాయి, విద్యుత్, బాత్‌రూమ్‌లు, ఎల్‌పిజి గ్యాస్ సౌకర్యం, డ్రైనేటి సౌకర్యం, వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, సిసి రోడ్లు సౌకర్యం, పశువుల షెడ్లు, తదితర అంశాలపై ప్రజలతో చర్చించారు.కార్యక్రమంలో తహశీల్దార్ పామిలేటి, ఇఒ ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, టిడిపి రాజంపేట పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు గాంధీపేట రమణ, టిడిపి మండల అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, ఉపాధ్యక్షులు బొక్కసం రామక్రిష్ణ, నాయకులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, పాల్గొన్నారు. **నిమ్మనపల్లె:** రాష్ట్రాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందుతే రాష్ట్ర, దేశం అభివృద్ధి చెందుతుందని మండల ప్రత్యేక అధికారి కె.ప్రసాద్ పేర్కొన్నారు. రాచవేటివారిపల్లెలో సర్పంచ్ సుబ్రమణ్యం, టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికారి ఆర్.జే.వెంకటేష్, రెడ్డివారిపల్లెలో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించగా, మండలంలోని పది గ్రామాలలో సర్పంచ్‌ల అధ్యక్షతన, మండల అధికారులు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై గ్రామసభలను నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ అభివృద్ధికి కృషి చేయడం జరుగు తుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు -ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకుని గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ధనంజయులు, ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎపిఒరమేష్, ఎఒ మురళీమోహన్, ఎంఇఒలు నారాయణ, పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రెడ్డిరాణి, పంచా యతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. **వీరబల్లి:** మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. వంగిమళ్ళ, డి.రాచపల్లి గ్రామసభలో రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొని మాట్లాడారు. మును పెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ముందుగా గ్రామ అభివృద్ధి చెందాలి అన్నారు. అనంతరం ప్రజలు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య ఉందన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నీటిని గంగనేరు ప్రాజెక్టుకు తీసుకువచ్చి చిన్నచిన్న కాలువలకు నీటిని వదిలితే పంటలు పండించుకోవచ్చు అన్నారు. గంగనేరు ప్రాజెక్టు నుంచి డి. రాచపల్లి వరకు లైను మార్గంలో ఉన్న కాలువను ఉపాధి ద్వారా పూడికను తీయాల న్నారు. వంగిమళ్ళ కస్పా నుంచి వీరబల్లికి రోడ్డు సౌకర్యం వేయాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతమ్మ, నాగులమ్మ, టిడిపి మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, కల్లూరు రామ్మోహన్‌రెడ్డి, పద్మనాభ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **కలికిరి:** గ్రామాల్లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని ఎంపిడిఒ గంగయ్య పేర్కొన్నారు. గ్రామసభల ద్వారా ఉపాధి హామీ పనులను గుర్తించి ప్రజలకు పనులు కల్పించడమే ప్రధాన ధ్యేయమని, ఈ గ్రామ సభల ద్వారా మండలంలోని 14 పంచాయతీలలో సుమారు 4000 పైన పనులు గుర్తించినట్లు ఆయన తెలిపారు.కదిరి మేజర్ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ పాల్గొన్నారు. **కలకడ:** మండలంలో ఉన్న 16 గ్రామ పంచాయతీలలో ఒక స్థానిక సచివాలయాల పరిధిలో గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న గ్రామాలను స్వర్ణ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ప్రజలకు ఉన్న సమస్యలు విద్యుత్, నీటి కుళాయిలు, మరుగుదొడ్లు, ఎల్‌పిజి గ్యాస్ సౌకర్యం, నీటి సరఫరా పథకం, డ్రెయినేజీ సౌకర్యం, దవ వ్యర్థాల నిర్వహణ సౌకర్యం, వీధి దీపాలు తదితర సమస్యలను తెలుసుకోవడానికి ఈ ప్రత్యేక గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. **చిన్నమండెం:** మండల పరిధిలోని 13 గ్రామాలలో శుక్రవారం అన్ని సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు.మండల పరిధిలోనిదేవగుడిపల్లి గ్రామంలో ఉపాధి హామీ ఎపిడి రవికుమార్, పంచాయతీ సెక్రెటరీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి కోసం నిర్వహించిన ఈ గ్రామసభలో ప్రజలు అధికారులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** మండలంలో ప్రభుత్వం తలపెట్టిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ కోరారు. 21 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలలో పశు సంవర్ధక శాఖ ఎడిగుణశేఖర్ పిళ్లై, మండల స్థాయి అధికా రులు, ఉద్యోగులు పాల్గొన్నారు. **రామాపురం:** డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధిపై గ్రామ సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రామాపురం మండల గ్రామాల ప్రత్యేక అధికారులు అన్నారు. మండలంలోని 13 గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ సచివాల యాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, నీటి సమస్యలు, వీధిదీపాలు వంటి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధనలక్ష్మి, సరోజమ్మ, నాగభూషణ్‌రెడ్డి, ఆంజనేయులు, మున్నీరుబాషా, టిడిపి నాయకులు చంద్రమౌళి రేఖం బ్రదర్స్ నారాయణ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** కురవంక పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దు దామని అధికారులు, సిబ్బందికి సర్పంచ్ పసుపులేటి చలపతి పిలుపునిచ్చారు.ఉపాధిహామీపై గ్రామసభను పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి ఆర్థిక సంఘాల నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పంచాయతీలో ఇప్పటికే మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. **నందలూరు :** రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం లభిస్తుందని నందలూరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలోని ఆరవపల్లి షాదిఖానాలో గ్రామసభ నిర్వహించారు. అవసరమైన వారికి మరుగుదొడ్లు విద్యుత్ సౌకర్యం నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. ఉపాధి హామీ కింద ఎక్కడెక్కడ ఏ పనులు జరుగుతున్నా యో వాటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎఒ ప్రకాష్,కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ కార్యదర్శి అమీర్, గోపీనేని హిమగిరి నాథ్‌యాదవ్, వార్డు సభ్యులు ప్రసాద్ గంగాధర్, లక్ష్మీదేవి, మహేశ్వరి వరలక్ష్మి, తాటి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

తెలుగుజాతి ఆణిముత్యం ప్రకాశం పంతులు

ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి-పీలేరు

తెలుగు జాతికి టంగటూరి ప్రకాశం పంతులు ఆణిముత్యం లాంటి వాడని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ నటరాజ తెలిపారు. ప్రకాశం పంతులు 152వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రకాశం పంతులు న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, సంఘ సంస్కర్తగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఆంగ్లేయులకు వ్యతి రేకంగా పోరాడిన గొప్ప వ్యక్తని తెలిపారు. నేటితరం విద్యార్థులు, యువత ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకుని ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎర్రయ్య, రాజన్న, మునిరామయ్య, మురళి, శశిదేవి, లీలావతి, లక్ష్మీదేవి, మురళి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ జీవితమంతా ప్రజాశ్రేయస్సుకోసం పని చేసి, స్వాతంత్ర్య సమర పోరాటంలో తనకు ఆరోజుల్లో రోజుకు వెయ్యి రూపాయల వరకూ కూడా వచ్చే ఆదాయం వచ్చే న్యాయవాద వృత్తిని కూడా విడిచిపెట్టి ఉద్యమంలో పాల్గొన్న గొప్ప నాయకునిగా, నిస్వార్థరాజకీయ నాయకునిగా పేరు పొందిన టంగుటూరి ప్రకాశం పంతులు గొప్పదనాన్ని గుర్తు చేశారు.అలాంటి మహానుభావుల అడుగుజాడల్లో మనమంతా నడవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పుష్పలత, శోభారాణి, నాగసునీత, షబ్బీర్, నాగేశ్వర, రేణుక, వేదవాణి, రాధ, వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులోప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అదిస్తున్న మురళీ

ఉప ముఖ్యమంత్రికి వినతుల వెల్లువ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ పంపించర్ల మల్లేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పంచాయతీకి సంబంధించి పలు సమస్యలను వినతి పత్రం ద్వారా అందిచారు. వినతి పత్రంలో సిమెంట్ రోడ్లు, ఆర్ఒ ప్లాంట్, మెటల్ రోడ్డు మొదలగు సమస్యలను ప్రస్తావించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రొంపిచర్ల మురళి, మనోజ్, మోహన్, శేఖర్, సాయి, భాను, సుధీర్, ప్రతాప్, సుమన్, మహిళలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : జడ్జి

ప్రజాశక్తి-కడప

ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం బాలాజీనగర్‌లో గల శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ర్యాగింగ్‌లో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను అవమానించడం, వేధించడం వంటివి ఉంటాయని అన్నారు. ఇలాంటి మానసిక హింసకు దారితీసి ప్రాణాంత కమవుతాయని తెలిపారు. లైంగిక వేధింపులు, స్వలింగ సంపర్క దాడులు, బట్టలు విప్పడం, అశ్లీల చర్యలు, సంజ్ఞలు, శారీరక హాని లేదా ఆరోగ్యానికి లేదా వ్యక్తికి ఏదైనా ఇతర ప్రమాదాన్ని కలిగించే అన్ని రకాల శారీరక వేధింపుల చర్యను ర్యాగింగ్ విభాగంలో క్రిమినల్ కొలతలతో చేర్చవచ్చని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పడే శిక్షలు సెక్షన్లతో జడ్జి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

25న పూర్వ బధిర విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కడప అర్బన్

హెలెన్ కెల్లర్ బదిరిలో ఉన్నత పాఠశాల, జూనియర్ డిగ్రీ కళాశాల పూర్వ బదిర విద్యార్థుల సమ్మేళనం ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు హెలెన్ కిల్లర్ సంస్థ కరస్పాండెంట్ డాక్టర్ పి. దౌలత్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రాజీవ్ గృహకల్ప రోడ్డు, కడపలో ఉన్న హెలెన్ కిల్లర్ విద్యాసంస్థలు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1984లో ప్రారంభమైన విద్యాసంస్థ 40 సంవత్సరాలు బదిరుల విద్యాభివృద్ధిలో తమ సేవలను అందిస్తూ ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి జీవితాలను బాగు చేసిందని పేర్కొన్నారు. పూర్వపు విద్యార్థులకు, సంస్థలో పనిచేసే విరమించిన సిబ్బంది హాజరు కావాలని తెలిపారు.

28న జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ పురుషుల కళాశాల, నోడల్ కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 28న జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెటోరో ల్యాబ్స్ లిమిటెడ్ వారు పాల్గొంటారని తెలిపారు.బిఎస్‌సి కెమిస్ట్రీ 2024లో ఉత్తీర్ణులైన 27 సంవత్సరాలు వయసు ఉన్న అబ్బాయిలు హాజరుకావాలని పేర్కొన్నారు. జూనియర్ కెమిస్ట్ ఉద్యోగానికి అర్హులని తెలిపారు. ఒరిజినల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్‌తో పాటు బయోడేటా, ఆధార్,పాన్ కార్డు జిరాక్స్‌తో హాజరు కావాలని సూచించారు. వివరాలకు జెకెసి మెంటార్లు డాక్టర్ ఎన్ సారధి, సి.వి.రవీంద్రారెడ్డి సెల్ నంబర్లు 9347256400, 939005291 సంప్రదించాలని తెలిపారు.

పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ నాగరాజు

గండి క్షేత్రంలో భారీ పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి-చక్రాయపేట

గండి క్షేత్రంలో మూడవ శ్రావణమా శనివారం పురష్కరించుకొని శుక్రవారం సాయంత్రం డిఎస్‌పి మురళినాయక్ ఆధ్వర్యంలో పలు స్టేషన్ నుంచి 270 మంది పోలీసు బందోబస్తు గండి క్షేత్రానికి చేరుకున్నట్లు సిఐ నాగరాజు తెలిపారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు వీరన్నగట్టుపల్లె క్రాస్‌వద్ద, రాయచోటి వైపు నుంచి వచ్చే వాహనాలు అద్దాలమరి క్రాస్ వద్ద నిలిపివేయాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలవకుండా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపివేయాలని తెలిపారు. గండి క్షేత్రానికి జిల్లా నలుమూల నుంచే కాకుండా అన్నమయ్య జిల్లా నుంచి వేలాది మంది భక్తులు వస్తారని ఎలాంటి అవాంత నీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని పోలీసులకు తెలిపారు. కార్యక్రమంలో ఆర్కే వ్యాలీ సిఐ నాగరాజు తో పాటు ఐదుగురు సిఐలు, 12 మంది ఎస్ఐలు, 270 మంది పోలీసులు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వైవీయూ అధ్యాపకులకు ఎంటిఎస్ అమలు చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం లోని అకడమిక్ కన్సల్టెంట్స్, గెస్ట్ ఫ్యాకల్టీ బృందం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. పీజీ, సెట్, నెట్, పిహెచ్‌డి అర్హత కలిగి అతి తక్కువ వేతనాలతో విద్యాలయంలో పనిచేస్తున్న తమకు మినిమం టైం స్కేల్ అమలు చేసేలా చూడాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్వవిద్యాలయాలలో పనిచేసే అకడమిక్ కన్సల్టెంట్ లకు ఎంటిఎస్ అమలు చేసేందుకు సిబిఎస్.వెంకట రమణ పేరుతో కమిటీ నియమించి అమలు దశలో ఎన్నికలు రావడంతో అర్థాంతరంగా ఆ ప్రక్రియ ఆగిపోయిందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం 110 జిఒ ఇచ్చిందని అయితే అది విశ్వవిద్యాలయాల్లో పూర్తిగా అమలు చేయలేదని తెలిపారు. పీజీ అర్హత ఉండి దశబ్ద కాలంగా పనిచేస్తున్న కొంతమంది అకడమిక్ కన్సల్టెంట్లను గెస్ట్ ఫ్యాకల్టీ గా మార్పు చేస్తూ రూ. 35 వేల జీతం నుంచి 25 వేలకు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులకు రూ.62వేలు వేతనం ఇస్తున్నారని, విద్యాలయాల్లో పనిచేసే తమకు రూ.35 వేలు మాత్రమే ఇస్తున్నారని వివరించారు. విశ్వవిద్యాలయంలో పని చేసే అధ్యాపకులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంటాక్ట్) హోదాతో పాటు రూ.57 వేల నుంచి రూ.80 వేల వరకు సర్వీసును బట్టి వేతనం ఇవ్వాలని కోరారు. ఎంటిఎస్ అమలుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే స్పందిస్తూ న్యాయబద్ధమైన మీ సమస్యను రాష్ట్ర విద్యా మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్తానని, అసెంబ్లీ లో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైవీయూ అకడ మిక్ కన్సల్టెంట్ ప్రతినిధులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న ఫ్యాకల్టీలు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-వల్లూరు

మొక్కల సంరక్షణ ప్రతి విద్యార్థి బాధ్యత అని వల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వల్లూరు ఉన్నత పాఠశాల నందు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లి పేరుతో ఒక చెట్టు కార్యక్రమంలో విద్యార్థులు చెట్లు నాటి వాటిని బాగా పెంచినందుకు శ్రీ విజయ దుర్గ ఏజెన్సీ సి.వెంకట్ రాజు చెట్టు పెంచిన 49 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్ ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకట్‌రాజు మాట్లాడుతూ విద్యార్థుల చెట్లు పెంచడం వల్ల వాళ్లకు ప్రోత్సాహంగా ఉండాలని వాటర్ బాటిల్ ఉచితంగా అందించామన్నారు. ఇలాగే విద్యార్థులందరూ చెట్లు పెంచాలన్నారు. అప్పుడే మానవాళి మనుగడ మెరుగుపడుతుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఏకలవ్య ఫౌండేషన్ విద్యా వాహిని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎన్విత, వెంకట సుదర్శన్ ,విద్యా వికాసం కోఆర్డినేటర్ వెన్నెల, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి అంటువ్యాధి కాదు

- డాక్టర్ ఓబులేసు

ప్రజాశక్తి-చాపాడు

హెచ్ఐవి అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని డాక్టర్ ఓబులేష్ తెలిపారు. మండల పరిధిలోని కేతవరం గ్రామంలో చైల్డ్ ఫండ్ ఇండియా స్కీం ఆధ్వర్యంలో అవగాహన, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వ్యాధి వ్యాపించు మార్గాలను, నివారణలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. జీవిత భాగస్వామితోనే లైంగిక సంబంధం కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపకూడదని, సమాజంలో అందరితో పాటు కలిసి జీవించేలా మానవత్వం చూపాలన్నారు. రక్తమార్పిడి, ఇంజెక్షన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి సుమలత, పర్యవేక్షకులు రమేష్, పాఠశాల ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, చైల్డ్ ఫండ్ ఇండియా సిబ్బంది మహబూబ్ బాషా, దర్బార్, సురేంద్ర, బిఎన్‌ఎం కీర్తి దాయని, ఆశా కార్యకర్తలు పద్మావతి ,రూప పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

యస్. అమరావతి W/o శ్రీనివాసులు రెడ్డి, ఓబిరెడ్డిపల్లి గ్రామం, మాగాండ్లపల్లి పోస్టు, వనమలదిన్న పంచాయతి, నా ఆస్తికి సంబందించిన డాక్యుమెంట్లు నా స్వగ్రామం నుండి పుంగనూరుకు వస్తునప్పుడు దారి మధ్యలో దారిపోయినవి. డాక్యుమెంటు నెంబర్లు, 277/ 2014, 4308/ 2018. ఇది ఎవరి కైనా దొరికినచో ఈ క్రింద తెలిపిన నెంబరుకు తెలుపవలెను. తెలిపిన వారికి పారితోషికం ఇవ్వడం జరుగుతుంది. సెల్: 8501899436.

షెడ్యూల్

చిత్తూరు జిల్లా ,పుంగనూరు మండలం, సర్వేనెంబర్ 27-6 చెక్ బందులు . తూర్పు: ఇదే నెంబర్ లో మా(ఎగ్గిలు)సొంత జమీను పడమర: సందగట్టు ఈశ్వరమ్మ జమీను ఉత్తరం:రోడ్డు దక్షిణం: ఇదే నెంబర్ లో గల మా (ఎక్సిలు)సొంత జమీను.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE-RLY KODUR
E.P.No. 22/2023
O.S.No.70/2022

వై.వి.ఎస్.ప్రసాద్,S/o శంకరయ్య.
...డిహెచ్ఆర్/వాది

Vs

ముద్దమ్ షేక్ మస్తాన్ సాహెబ్, తండ్రి గఫూర్ సాహెబ్, వయస్సు 53సం॥లు, R/o D.No.8/308, గాంధీనగర్, రైల్వేకోడూరు టౌన్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా, ఎ.పి.
...జెడిఆర్/ప్రతివాది

పై దావాలో వాది డిక్రీ పొంది ప్రస్తుతం డిక్రీ మొత్తమును వసూలు కొరకు పై తెలిపిన E.P.No.22/2023 దాఖలు చేసియున్నారు. ఇందు విషయమై మీకు ఎలాంటి అభ్యంతరములు ఉన్న యెడల 30.8.2024 తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు నేరుగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకొనవలెయును. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the Court//
A.VENKATA RAMA RAJU, B.Com.,B.L.,
Advocate,
Rly Kodur.